


శ్రీ శ్రీవాస

—(o)—

౧

భమిడిపాటి వారింట్లో జనాభా లెక్కల ప్రకారము గాని, చూస్తే గాని తేలే మొత్తం జన సంఖ్య నలుగురు మాత్రమే. ఇంటి పెత్తనం అజమాయిషీ ఇంటావిడ సుబ్బమ్మగారి కేమీ లేదు. అంతా గౌరమ్మగారే ఇంటి అధ్వర్యం వహించడం—గౌరమ్మ పుట్టినప్పటి నుంచీ వితంతువు; ఏనాటినుంచో అన్నగారిల్లు కనిపెట్టుకొంటూంది. అన్నగారన్నప్పటికీ, వొదిన సుబ్బమ్మ అన్నా ఆవిడకు ఎంతో అనురాగం. అయితే పాపం పాతికేళ్ళనుంచి కాపురం చేస్తూవున్న ఈ దంపతులకు ఒక్క నలుసుకూడా కలగలేదని విచారిస్తో వుంటుంది ఆవిడ. ముద్దూ ముచ్చటలూ తీర్చుకొనే యోగ్యత, తనూ ఓ చంటి పిల్లాణ్ణి ఎత్తుకుని రింగురంగా అనుకొంటూ, నలుగురిలో తిరగడానికి అదృష్టం లేమకదా పెట్టి పుట్ట లేమకదా అని అనుకొనేది సుబ్బమ్మ. గౌరమ్మ ఎంతో అమాయికత్వంతో కళ్ళమ్మట నీళ్ళెట్టుకొంటూ "అయ్యో ఏజన్మలో నేబ్రాహ్మడికి ఉద్ధరిణెడు గంగయినా పొయ్యలేదు. అందుకే ఈ జన్మలో నోచుకోలేదు. వంశం నిలువపెట్టే ఒక్క పిల్లా పీచూ లేదాయిరి" అని విచారించడం మామూలు. సుబ్బమ్మ ఇరుగుపొరుగు అమ్మలక్కల పిల్లల్ని చూసి ఎంతో మురిసిపోయి తనకుకూడా ఎప్పుడు కడుపు పులిస్తుందోనని అనుకొనేది. అచ్చట్లూ ముచ్చట్లూ తీరడానికని చెప్పి చెల్లెలి కూతుర్ని తెచ్చి పెట్టుకొన్నది. ఆ అమ్మాయికి మూడేళ్ళుంటాయి. ఆ అమ్మాయిని మాసుకొంటూ సుబ్బమ్మ కాలక్షేపం చేసుకోవడం మొదలు పెట్టింది.

గౌరమ్మగారు కొంచెం గడుసుతనం తెచ్చి పెట్టుకుని పిల్లా పీచూ లేరని వదినగారిని సరిగా చూచేది కాదు. ఎప్పుడు అన్నకొడుకును ఎత్తుకొని ముద్దులాడుదామా అని వుండేది.

గౌరమ్మగారిలాగ సుబ్బమ్మకూ పిచ్చి ఎత్తినట్టయింది పిల్లలకోసం. ఇద్దరూ మొగం వాచిపోయారు. సుబ్బి కళ్ళు మూసుకొని పడుకొంటే, తాను చంటాణ్ణి వొళ్ళో పడుకో పెట్టుకొని నమల పెడుతున్నట్టు, ఆముదం తలకు రాస్తున్నట్లు, జోలపాటలు పాడుతున్నట్లూ ఆమెకు తోచేది. ఒకసారి నిద్రలో ఎప్పుడో ఏదో పత్రికలో చదివిన ఉగ్గుపాటలు 'జోజో సుగుణాలవాల జోజో నా ముద్దుల మూట' అని పలవరించే సరికి నారాయణ గారికి నిద్రాభంగం కలగడంతోటే ఆవిణ్ణి అవతలకు త్రోసివేశాడు. మంచం మీదనుంచి లేచి ఆవిడ ఖంగారుపడి కళ్ళు నలిమికొని కళ్ళమ్మట నీరు కారుస్తూ భర్త పాదాల చెంత నిలవబడి, "మీకంటే పిల్లాపీచూ అక్కల్లేదు

కాని వంశం నిలవబెట్టే ఒక్క నలుసు లేదాయిరి. ఇంతను నా ముఖాన భగవంతు డిలాగ వ్రాశాడు. శ్రీమన్నారాయణమూర్తి ఎప్పుడు అనుగ్రహిస్తాడో. పొరుగింటావిడ నిన్న చంటిపిల్లను చంకేసుకొని వస్తే మహా ముచ్చట వేసింది. ఇంతకూ ఈ జన్మలో మనకు...” మాట పూర్తి అవకుండానే అమాయికపు నారాయణ పెళ్ళాము కన్నీరు తుడిచివేస్తూ ‘అవునే మన చేతుల్లో ఏమీ లేదు. అన్నింటికీ వాఁడే వున్నాడే పైన. నీ అదృష్టం ఎప్పుడు ఫలిస్తుందో...’ అన్నాడు.

సుబ్బమ్మ పందిరి మంచందగ్గిర నిలబడి ముఖం ప్రక్కకి తిప్పేసుకొంది కోపంతో కళ్ళు తుడుచుకొంటూ. ‘చాల్లెండి. ఎంత అమాయికత్వం’ అనేసింది. ముంగురులు రేగి ముఖాన వాలేయి. ఆవిడ కళ్లల్లో రాగపేశలత్వం కనిపిస్తోంది. ముదిముఖం అయినా ముఖాన అక్కడక్కడ స్ఫోటకం మచ్చలున్నా వేసుకొన్న పౌడరు కన్నీళ్ళకు చెరిగిపోయింది. తదేక దృష్టితో నారాయణ ఆమెకేసి చూచాడు.

ఆ పుణ్యాదంపతులు తిరగని పుణ్యక్షేత్రమూ, సేవించని తీర్థమూ లేదు. ఎంతమంది బ్రాహ్మల్ని మేపేరో అవజ్ఞా వేస్తే వందల సంఖ్య తేలుతుంది. చెట్టునీ పుట్టనీ చూసిందల్లా కనపడిందల్లా మ్రొక్కుతూ వుండేవారు. సంతాన గోపాలం ఉపాసన పొందేరు. ఏమి ప్రయోజనం? ఫలితం కినపడలేదు.

సుబ్బమ్మకు ఇంట్లో తిండీ తిప్పలూ సరిగా పెట్టేది కాదు గౌరమ్మ. ఏదో రెండు వేసి మెతుకులు పెట్టేది సుబ్బమ్మకు. పిల్లలు లేరనే బెంగ జాస్తీ అయింది. క్రమంగా తనకు తాను ఓదార్చుకొన్నది. ఎల్లాగయితేనేం, నారాయణ మూఢత్వానికి విచారించేది.

## ౨

నారాయణకు మొదటెనుంచీ చదువైతే అబ్బలేదు కాని సంధ్యావందనం చేసుకోవడంమట్టుకు అబ్బింది. ఏవో నోములూ వ్రతాలూ చేయించి రోజూ బియ్యం పప్పు కొంపకు చేరేశేవాడు. పౌరోహిత్యం మూలాన చాలా సంపాదించాడు. పల్లెటూరిలో పండిత పుత్రుల్ని పోగువేసికొని వీధి అరుగు విరిగేటట్టు కూర్చుని పుట్టమీద పురంమీదా కబుర్లు చెబుతూంటాడు. మనిషి స్వరూపం మసిపూసిన మారేడుకాయ. కళ్లు తేనెకళ్లు, గోప్పాదమంత పిలక వెనకా, ఓ పెద్దబొజ్జా, మధ్య మధ్య వళ్ళీం పీలుపు అన్నీ సనాతనిష్టు పెద్దమనిషి లక్షణాలూ రూపం అతనిలో వున్నాయి. వంటిని నగలు లేకపోయినా చెవుల పోగులున్నాయి, చేతులకు మురుగులున్నాయి.

ఇక వర్ణనానంతరం—పాపం ఇతగాడు సత్యకాలపు మనిషి, అమాయికుడు, వెర్రిబాగులవాడు, మళ్ళీ ఈ శతాబ్దిలో రూపొందిన అపర ప్రవరుడు. పెద్దన్నగారి వంటి భావకవి పెద్ద ఎవరేనా ఇతని విషయం వ్రాయగలడు. ఇతనికి ఆ అభిప్రాయమే లేదు, ఏ బంగా లేదు. ఒక విధంగా సంతాన నిరోధ సమస్య ఆదర్శ పూర్వకంగా నైతికంగా ఇతనివల్లనే పరిష్కరింప బడినట్టు తోస్తుంది అందరికీ!!!

ఇలా వుండగా సుబ్బమ్మ వొకసారి తనకు కడుపు వస్తే ఎలా వుంటుందోనని అనుకొన్నది. కూర్చొన్నచోటనుండి కదలకుండా మహారాణీ సాహేబ్‌కంటె అతి దర్జాగా సమస్తమైన చాకిరీ చేయించుకోవచ్చును; రకరకాల చిరుతిళ్లు చూసిందల్లా కోరిందల్లా తినవచ్చునని అనుకొన్నది. కడుపు వచ్చినట్లు నటిస్తే ఇంట్లో వెర్రిబాగుల గౌరమ్మ సుబ్బమ్మ నటన గ్రహించలేక పోయింది. నిజంగా కడుపే ననుకొని అమాయికమైన సంతోషంతో ఏది కావాలంటే అది చేసి పెడుతూంటే సుబ్బమ్మ పని జోరుగా వుంది. నెల తప్పినట్లు పుకారు వేసింది. పిండి వంటలు రోజూ చేస్తుంటే తరవాయి పని సుబ్బమ్మ చేసేది. కడుపు కాబట్టి వేవిళ్లు దాఖలా చూపెట్టాలి కనుక భోజనం అంతా అయ్యాక మజ్జిగోసుకొని కొంచెం అన్నం పిండి పారేసి విస్తరిచుట్టూ ఉమ్మేసుకుని, ఇస్సో అస్సో, రామా అనుకొంటూ ఆయాసం నటిస్తో ఎలాగో వణుకుతూ చేయి కడిగేసుకుని మంచంమీద నడ్డి వాల్చేది.

‘అయ్యో అమ్మా రెండు మాసాలైనా వెళ్ళందే మాయదారి వేవిళ్లు పట్టుకున్న యిషే’ అని విచారించేది గౌరమ్మగారు. క్రమంగా ఏదో మాసం వచ్చినట్టు నటించి హఠాత్తుగా వక రోజున ‘అయ్యో వదినా నా కడుపు కాలిందమ్మా’ అంటూ పొలికేక వేసింది. వంటింట్లో తడిబట్టతో నానుతూ వున్న గౌరమ్మగారు వచ్చి కడుపునొప్పి అంటూ తమాషాగా ఏడుస్తున్న వదినగార్ని చూసి అన్నతో “ఏమిరా దాని ఖర్మం ఏమిటో ఆలోచించు. వచ్చింది వచ్చిందనుకున్న కడుపు చూడ

పోతే ఇల్లా, గడ్డలయింది. నాకేమీ చైతన్యం లేదు. కాళ్లు చల్లబడ్డాయి నాకు" అన్నది.

ఇరుగు పొరుగు అమ్మలక్కలు వచ్చి 'రాక రాక ముప్ఫైయోయేట కడుపువస్తే ఇలా అవుతుందనుకో లేదండీ పిన్నిగారూ. ఎవ రేంచేస్తారు. వాడున్నాడు మంచి చేసినా, ఏంచేసినా. మనం ఏమో శాశ్వతం అనుకొంటాం. ఏదీ మనతరమా, మొన్న శాస్త్రిల్లుగారు పురాణంలోకూడా చెప్పారు" అన్నారు.

## 3

సుబ్బమ్మ కడుపువిషయం గ్రామంలో వదంతి కింద బయలుదేరింది. కొన్నాళ్లకు సద్దు అడగింది. దసరాలకు పుట్టింటికి పెనుమర్రు వెళ్లింది. ఈసారి నిజంగానే కడుపు అని చెప్పి పుకారుచేసింది. వాళ్ల ఎదర గుమ్మమే అత్తారిల్లుకూడా. ఎవ్వరూకూడా నమ్మకుండా వుండేవాళ్లే వెనకటివిషయం తెల్సుస్తే. తల్లీ చెల్లెళ్లూ గాజులు పట్టించారు సుబ్బమ్మకు. గ్రాండ్ గా సూడిదలు చేశారు. బ్రహ్మాండంగా రాక రాక వచ్చిన కడుపు కనుక అందరికీ మహానందంగా వుంది ఎప్పుడు ప్రసవిస్తుందా అని. "ఆడపిల్లయితే మా అబ్బాయికండో" అంటూ ఇంట్లో ఓగుంని ముసిలిది మొదలెట్టింది. తల్లి 'అయ్యో చిన్నా, పోయినసారి అలా నవ్వుబాట్ల పని అయింది, లోకంతోపాటు వ్యవహార మనుకొంటే. ఈ సారి అయినా ఆ తల్లీ పిల్లా గట్టున సురక్షితంగా పడితే, పురిటిసిల్లనాడు ఊరి బయట రావిచెట్టుకింద వీరాంజనేయులికి వంద కొబ్బరికాయలు, ఆకుపూజ చేయిస్తా' అని అనుకొన్నది దీపారాధన చేసుకొని.

నొప్పులు వచ్చినట్లు మధ్య మధ్య నటించేది. మధ్యన సావేరీ ఆలాపన, మూలుగు రావడంకద్దు. కాస్సేపు అరుగుమీద కూర్చొని వెళ్లపోసుకోవడం బలవంతాన. ఇలా అవస్థ పడుతోంది. తొమ్మిదవమాసం దాటించింది తన నటనలో.

ఓరాత్రి పల్లెటూరి వాళ్ల పద్ధతుల ననుసరించి సుబ్బి బహిర్దేశానికి చెల్లెలి కూతుర్ని కూడా తీసుకొని ఊరి వెలుపల చెరువుకు వెళ్ళింది రొప్పుతో. అప్పటికి చీకటి మసకగా వుంది. జనం ఎవ్వళ్లూ రావడంలేదు. చిన్నపిల్లతో తనకు అమాంతంగా నొప్పులు వచ్చాయని చెర్వుదగ్గరే వున్నట్టూ తల్లీ వాళ్లకు కబురంపింది. అందరూ లాంతర్లు వేసుకొని కంగారుపడుతూ ఏడుస్తూ వచ్చారు.

వచ్చేసరికి సుబ్బమ్మ ఏడుస్తూ నేలమీదికి వంగిపోయి అతిబాధ పడినట్టు నటిస్తూన్నది. వెంట్రుకలన్నీ చెదిరిపోయాయి. బలవంతాన ఏడుపు తెప్పించుకొన్నట్టుంది.

'అమ్మా అంతా అయింది, కడుపు గడ్డలయింది. బిడ్డ ఏదో తెలియకుండానే మాయదారి పిచ్చికుక్క నోట కరచుకు పోయింది' అన్నది.

నిజమనుకొన్నారు. అత్తారు నమ్మలేదు. గౌరమ్మగారు నిజ మనుకొన్నారు. "దీని కడుపు ఉత్తది; టక్కులు చేస్తోంది" అన్నారు.

గౌరమ్మగారు వచ్చి 'అయ్యో అదేమిష్రాం. గాజులు పట్టించారు, సూడిదలు చేశారు. కడుపు లేదంటారు. దానికి కడుపే, అలా గడ్డలయింది. ఖర్మం' అంది.

నారాయణకు కబురు పంపారు.

'నాకేమీ ఆవిషయం తెలియ' దన్నాడు.

అంతా విరగబడి నవ్వారు. నారాయణ వెర్రివాడని అపర ప్రవరుడనీ ఖ్యాతి స్థిరమైంది.

మీకు కావలసిన చక్కని యుడుపులు, గుడ్డలు, పలువిధములైన స్వదేశీ సిల్కు చీరెలు, జాకెట్టు రకములును
కేశవరామ్ అండ్ కంపెనీ,
1/287, ఎస్ప్లనేడ్ రోడ్డు, మద్రాసున దొరకును. మంచి సరకులు! వెల సరసము!